


"మీ నాన్న ఏమన్నాడు గీతా ?"

"పాతపాటే."

"అంటే"

"నువ్వు మేనల్లుడివి. అల్లుడివి కాలేవట ?"

"ఏం ?"

"నువ్వో గుమాస్తావట. నీకిచ్చి పెళ్ళి చెయ్యడం కంటే ఘోరం లేదట. నన్నో యువరాజు కిచ్చి పైఅంతస్థు సంబంధం చేస్తాడుట."

"అలాగే నాన్నా.... అన్నావా ?"

"అంటే నీ దగ్గరకి ఎందుకొస్తాను ?"

"అయితే లేచి పోదామా?"

"ఛీ.... వెధవ సిన్మా డైలాగ్"

"ఏం చేద్దాం మరి. మీ నాన్న యిక్కడుంటే మన పెళ్ళి చెయ్యడు. మనల్ని చేసుకోనివ్వడు. ఎన్నాళ్లు నిన్ను చూసి నోరు చప్పరించను?"

"కొన్నాళ్లే మనకి పార్కు సమావేశం, తర్వాత జంటగా...."

"అలా నోరూరించకు, మన పెళ్ళవుతుందని నాకు నమ్మకం లేదు"

"నిరాశపడితే ఎలా బావా? ప్రతీ సమస్యకీ సమాధాన ముంటుంది."

...ఈ పై డైలాగులు ఏ సినిమా లోనివి? ఏ నాటకం లోనివి? లేదా ఏ సీరియల్ నవల లోవి?

ఎందులోనివీ కావు. గీతా, తాండవ కృష్ణ ఒకనాటి సాయంత్రం మునిసిపల్ పార్కులో మాట్లాడు కున్నవి.

ఎవరు వాళ్లు?

ప్రేమికులు. దంపతులు కావాలని ఆకాంక్ష.... ఆశ.... ఆశయం. పెళ్ళి వారిద్దరికీ సంబంధించినదైనా, దానికి వారి పెత్తనం ఏంలేదు. తోలుబొమ్మల్లా ఎలా తిప్పితే అలా తిరగాలి.

గీత వేరుశనక్కాయలు ఒలుస్తూ, కాసిని తాండవకృష్ణ కిచ్చింది. ధైర్యం చెప్పింది. ఏం చెయ్యాలో చెప్పింది. ఎలా చెయ్యాలో చెప్పింది.

తాండవకృష్ణ తాటికాయంత ముఖం చేసుకున్నాడు.

* * *

ఆఫీసులో ఎవరికయినా ఫోన్ వస్తే మేనేజర్ చిరాకుపడిపోయి, లేడనో, వీల్లేదనో చెప్పేస్తాడు. కాని గీత విషయంలో మాత్రం అలా చెయ్యడు. ఆమెతో మాట్లాడటమే మహద్భాగ్య మనుకుంటాడు. బజర్ నొక్కినా జవాను రాలేదు. తనే గీత టేబిల్ దగ్గరికి పోయి చెప్పాడు.

'థాంక్యూసర్' గీత ఓ నవ్వు పారేసి ఫోన్ అందుకుంది.

"వనమాలిని మాట్లాడుతున్నా. పార్టీ సంగతి గుర్తువుందా?"

"అలాగే. నెలాఖరి రోజులు. ప్రెజెంట్సుండవ్?"

"నీ రాకే చాలు. కారు పంపించనా?"

"అక్కర్లేదు. కాకి కార్లో వస్తా." ఫోన్ పెట్టేసింది.

మేనేజర్ పెన్సిల్ చెక్కుతూ కూర్చున్నాడు. గీత ఫోన్ పెట్టగానే "పర్మిషన్ కావాలా గీతా" అడిగాడు.


"సాయంత్రం పార్టీకి యిప్పట్నుంచీ ఎందుకు సార్. అవసరంలేదు."

"నీకూ్కడ పార్టీ యివ్వాలి గీతా నేను."

"పెళ్ళి చేసుకుని - యివ్వండి." ఈ మధ్య మేనేజర్ భార్య పోయిందని, మళ్ళీ పెళ్ళికొడుకు అయ్యాడని తెల్సి అంది.

"నిన్ను చేసుకుంటాను గీతా—"

అని అతడు అనేస్తాడని గీత




తొందరగా తన సెక్షన్‌లోకి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఆఫీసు వదిలాక గీత సిటీ బస్‌లో వెళ్ళాలని ఎప్పట్నుంచో అనుకుంటోంది. కాని ఆ ఛాన్సు రాదు. కాకి సిద్ధం.

కామంతుల కిష్టారావు అసలు పేరు. దగ్గరివాళ్లు కాకి అంటారు. రంగూ అదే. వయసు యాభై మైనస్ యిరవై. వుద్యోగం ఛోటా ఆఫీసరు.

"గుడీవెన్ గీటా–" తలుపు తెరుస్తూ అన్నాడు.

"కావ్ ! కావ్ !.... కాకులతో యిలాగే మాట్లాడాలి."

"అన్నగారు నిన్ను తీసుకురమ్మని ప్రత్యేకంగా చెప్పారు." కారు ముందుకు పోనిస్తూ అన్నాడు.

"ఇలా ఎక్కడికి ? యింటికి పోనీ, బట్టలు మార్చుకోవాలి. పార్టీలోకి యిలాగే రానా ?"

"నువ్వు అప్పలమ్మగా వుంటేనే మాకు మతులు పోయాయి. అప్పరలా అలంకరించుకుంటే 'హెవీకిక్' అన్నగారు, నేను కూడ తట్టుకోలేం. బైదిబై పార్టీ అంటే మనం ముగ్గురమే."

వనమాలి గేటు దగ్గర స్వాగతం చెప్పాడు.

"మీ నాన్న పార్లమెంటుని వుద్ధరిస్తున్నాడు నువ్వు అసెంబ్లీ నయినా వుద్ధరించాలని పుట్టినరోజు శుభాకాంక్షలు" అంది గీత లోపలికి దారి తీస్తూ –

"నీతో మాట్లాడటం చాల భయం మాకు—" వనమాలి టేబిల్ ముందు కూర్చుని పదార్థాలు వడ్డించ సాగేడు.

"అందుకే పెళ్ళి చేసుకోండి నన్ను అంటున్నాను." అంది గీత.

"నిన్నా! నయంలే. నీ రూల్స్ పాటించడం మా వల్ల కాదు. కనడం మినహా తక్కిన పనులన్నీ మేమే చెయ్యడం మాకు కుదరదు. నువ్వు మొగుడివి. మేం పెళ్లాలం అయిపోతాం" కాకి బాటిల్ ఓపెన్ చేస్తూ అన్నాడు.

"మీరు దద్దమ్మలని నాకు తెల్సు. పెళ్ళి చేసుకునే ధైర్యం లేకపోయినా, చేయించే ధైర్యమయినా వుందా?"

మందు రౌండు తిరిగింది.

"అదెంత పని? చెప్పు.... ఎవరితో!"

"తాండవ కృష్ణ."

"పూర్ ఫెలో" యిద్దరూ ఒక్కసారే అన్నారు

కోలా చప్పరిస్తూ అంది గీత. "మీకు ధైర్యం లేకే బాండ్ మీద సంతకం పెట్టలేదు. కృష్ణ నా షరతులు చదివి వినిపించగానే కళ్లు మూసుకుని సంతకం పడేశాడు. ప్రేమంటే అలా వుండాలి. ఈ పెళ్ళి తతంగంలో మీకూ పాత్రలున్నాయి....

"ఏం చెయ్యాలి మేం?"

గీత చెప్పసాగింది.

* * *

సీతారాములు గర్వించాడు. నిమ్మకాయలు నిలబెట్టే మీసాలని దువ్వుకుని న.్వాడు. ఆనందంగా....అతిశయంగా. అ.ంకారంగా.

ఎందుకు గర్వించాడు సార్? సీతారాములు మంత్రి కాబోతున్నాడా? లేదా నూరురోజులు ఆడే సిన్మాతీశాడా?

ఏంలేదు. సీతారాములు గ్రేట్ మాన్ కాదు. ఓ నగటు మనిషి. ప్లీడరీ గుమస్తా. ఎందుకు గర్వించాడు మరి?

గీతకి తండ్రి అయినందుకు! తన కల నెరవేరబోతున్నందుకు!


గీత బంగారు బొమ్మ. అందాల భరిణ. ముసలివాళ్ళని గతంలోకి, పడుచువాళ్ళని రేపులోకి గెంటగల పదును ఆమె అందానికుంది.

అందుకే సుప్రసిద్ధ ప్రజాసేవకుడు, రాజకీయ ప్రముఖుడు బాపయ్య 'గీతను నా కోడలుగా చేసుకుంటాను.' రమ్మని కబురు పెట్టాడు.

అందుకే సీతారాములు గర్వించాడు. గీతకి పెద్దయింటి సంబంధం చేసి తనూ ఎదిగిపోవాలని సీతారాములు ప్లాన్!

ఎగురుకుంటూ వెళ్లాడు. విశాలమైన బంగళా నిశ్శబ్దంగా వుంది. మేడమెట్లు దగ్గర నౌకరు ఎదురయ్యాడు. సీతారాముల్ని రెండవ అంతస్థు బాల్కనీలోకి తీసుకుపోయాడు.

అక్కడ వనమాలి 'మందు' చప్పరిస్తూ కూర్చున్నాడు. కూర్చోమని మర్యాద చెయ్యలేదు. కూర్చుంటాడేమోనని ఎదురు సోఫాలో కాళ్ళుపెట్టి, "నాన్నగారు ఢిల్లీ వెళ్ళిపోయారు. నన్ను మాట్లాడమన్నారు. గీతని పెళ్ళి చేసు



కుందామనుకుంటున్నాను. ఏమంటావ్?" విలాసంగా అడిగాడు.

సీతారాములు నిర్ఘాంతపోయాడు.

"ఏమంటావ్ లే! అప్పుడే నీ ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. నీ బ్రతుకు పెట్టుకుని యింతటి సంబంధం చెయ్యగలవా? నోనో .... ఇట్స్ ఎ బూన్ టు యు .... అవును?" కళ్లు ఎగరేస్తూ నవ్వాడు.

సీతారాములు వెలిసిపోయిన బొమ్మలా వెలవెలపోయాడు. అతడిలో గర్వం జారిపోయింది. తనని నౌకరుకంటె హీనంగా జమకట్టడం కారం రాచినట్ల యింది. అయినా ఏమనలేక చేతులు నలుపుతూ వింటున్నాడు.

"రెండు మూడు ముహూర్తాలు పెట్టి వుంచు. మాకు వీలయినదిఎన్నుకుంటాం! రేపు మధ్యాన్నం వస్తాను నేను. గీతని తయారుగా వుండమను."

"అమ్మాయిని అడిగి చెప్తాను." అన్నాడు అయిష్టంగా సీతారాములు.

"వేరే నువ్వు అడగాలా? ఇంతకంటె మంచి సంబంధం తెస్తావని గీత ఆశ పడగలదా? సీతారాములూ ....అతి తెలివి ప్రదర్శించక చెప్పినట్లు చెయ్యి. ఇక

వెళ్ళచ్చు నువ్వు" విస్కీ నిషాలో అరచాడు వనమాలి.

సీతారాములు బయటికి వచ్చి రోడ్డు ఎక్కాడు. 'రిక్షా రానా బాబూ' అని రిక్షావాడు అడిగినా సమాధానం చెప్ప లేదు. దూరమైనా నడవడానికే నిశ్చ యించుకున్నాడు. అవమానం అందుకు తయారుచేసింది.

తనని గడ్డిపరకలా తీసిపడేశాడు. ఇవి పెళ్ళి మాటల్లా వున్నాయా? వారి అహంకారమంతా తనముందా? పెళ్ళి కాకుండానే తనస్థితి యిలావుంటే, రేపు పెళ్ళయ్యాక తనని గుమ్మం తొక్క నిస్తారా?

ఆ రాత్రి ఏదో ఎంగిలిపడి సీతా రాములు మంచం ఎక్కాడు. ఈ సంబంధం మాట గీతతో చెప్పాలని పించడంలేదు. ఒకవేళ చెపితే .... చేసుకుంటానంటుందేమో?

మర్నాడు సీతారాములు లేచేసరికి పొద్దెక్కింది. కాఫీ త్రాగుతూవరండాలో పేపరు తిరగేస్తున్నాడు. గుమ్మంలో కారు ఆగింది. వనమాలేమోనని కంగా రుగా చూశాడు. కాదు. ఆ యువకుడు.... తెల్సున్న ముఖమే....ఆఫీసరు."

సీతారాములు తొందరగా లేచిచేతులు జోడించాడు. కుర్చీ తెచ్చి వేశాడు. గీతని కాఫీ తీసుకురమ్మని కేకవేశాడు.

"మీరు స్వయంగా రావాలా? కబురు పంపితే వచ్చి మీ దర్శనం చేసుకునే వాడ్నికదా!" సీతారాములు చేతులు కట్టుకుని వింటున్నాడు.

కిష్టారావు నవ్వాడు. "నా అత్యత ఇలా రప్పించింది. మన మధ్య పరిచయం లేకపోయినా నేరుగా వచ్చేసాను. నా వుద్యోగం, హోదా మీకు తెల్సు. గీతని ....అదే మీ అమ్మాయిని పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నాను."

హఠాత్తుగా పడిన వానలో తడిసి నట్లయింది సీతారాములికి. కాని తన కలవరపాటుని అణచుకున్నాడు. ఎదు రుగా పోయి గీత చేతిలోనుంచి కాఫీ అందుకుని కిష్టారావుకి యిచ్చి కుర్చీలో కూర్చున్నాడు.


గీత తన ఏకైక సంతానం. అల్లారు ముద్దుగా ఆమె తల్లిపోయినా పెంచి పెద్దచేశాడు. గీతది కన్నుచెరిపే అందం. అందుకే సంబంధాలు తన కాళ్ళ ముందుకి వస్తున్నాయి. వనమాలికంటె కిష్టారావు నయం. తనకో మర్యాద యిచ్చాడు.

"మీరేం మాట్లాడరేం? ఇష్టంలేదా?" తీక్షణంగా అడిగాడు.

సీతారాములు సర్దుకుంటూ "ఎంత మాట? రాజాలాంటి సంబంధం. కాని మీతో వియ్యానికి సరిపడగలమా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"అంత భయపడవల్సిందేముంది. నాకు లక్షల మీద కట్నాలు యిస్తా మంటూ సంబంధాలు వస్తున్నాయి. గీత

తరువాత పేజీల్లో చూడండి :




నన్ను బాగా ఆకర్షించింది. కట్నం లేక పోయినా పెళ్ళి గ్రాండ్‌గా చెయ్యాలి. మా ఫాదర్‌ది మిలిట్రీ డిసిప్లిన్. అన్నీ టైం ప్రకారం జరిగిపోవాలి ఇవాళే మా ఫాదర్‌కి ఫోన్ చేస్తాను. ఆయన రాగానే మీకు కబురు చేస్తాను." కిష్టారావు కారు దగ్గరికి నడిచాడు

సీతారాములు సోప్ తీసుకుని బాత్‌రూంలోకి నడిచాడు. రాత్రి పొందిన మనస్తాపం విరగడయింది. కిష్టారావు ధర్మమా అని వనమాలి సంబంధం తప్పి పోయింది. తనకి అమర్యాద జరిపి నందుకు ఫలితం అనుభవిస్తాడు.

మధ్యాహ్నం కోర్టునుంచి లంచ్‌కి వచ్చేసరికి, వనమాలి వచ్చిపడ్డాడు "ముహూర్తం పెట్టించానా?" అంటూ.

సీతారాములు పిరికిగా చూశాడు. "అమ్మాయికి యిష్టంలేదట బాబూ...."

వనమాలి మాయలఫకీరులా నవ్వాడు. "నన్ను కాదనే ఆడపిల్ల వుంటుందా? గీతా .... గీతా .... మీ నాన్న చెప్పింది నిజమా? చెప్పు."

గీత మాట్లాడలేదు.

"నువ్వు లేందే బ్రతకలేను గీతా. నువ్వు కోరిన చీరలు, నగలు, ఐశ్వర్యం నీముందు వుంటాయి. బాగా ఆలో చించుకో. ఏ ఆడదయినా యింతకంటె

ఏం కోరుకుంటుంది. ఖరీదైన మొగుడు చాలు. అవునా?"

"నాకేం తెలియదు బాబూ" గీత సిగ్గుపడి లోపల కెళ్ళిపోయింది.

వనమాలి సిగరెట్ వెలిగించి బూటు చప్పుడు చేస్తూ హాల్లో పచార్లుచేస్తూ, "ఏవయ్యా! ఏ ఆడపిల్లయినా యింత కంటె ఏం చెబుతుంది? గీతకి యిష్టం లేదని అబద్ధం చెప్తావా. నాతో వేళా కోళం ఆడనామని వుందా? నేను చంద శాసనుడ్ని. కళ్ళు ఎఱ్రజేస్తే నువ్వు ఎక్కడ వుంటావో ఆలోచించుకో. గీత నాన్నవైనందుకు క్షమించేస్తున్నాను. సాయంత్రం వస్తాను. అన్నీ సెటిల్ చేసుకుందాం." చెప్పి కారులో వెళ్ళి పోయాడు.

"నా గీత యిలా ఏడ్చిందేం?" సీతా రాములు నెత్తి బాదుకున్నాడు.

కూతురిమీద కోపం ఎగిసిపడుతోంది. కాని ఏమనలేక పళ్ళు పిండుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. హోటల్లో భోంచేసి మాట్నీకి వెళ్ళిపోయాడు. ఇంటికెళితే వనమాలి వుంటాడని ఫస్ట్ షోకి వెళ్ళిపోయి ఆ సినిమాకూడా చూశాడు. తొమ్మిదిన్నరకి యింటికి బయలుదేరాడు.

దూరాన్నుంచే తన యింటిముందు పరీక్షించి చూశాడు. కారు లేదు. వూపిరి పీల్చుకుని లోపలికి అడుగుపెట్టాడు.

కిష్టారావు కూర్చుని వున్నాడు.

"మీరా....?" వెర్రిగా నవ్వుతూ పలకరించాడు.

"భలే పెద్దమనిషివి లేవయ్యా .... నీ మాటమీద మా నాన్నగార్ని రప్పిం చాను కూడ. గీతని వనమాలికివ్వడానికి అంగీకరించావుట కదా! నిన్న జరిగిన ఆ విషయం నాతో చెప్పావా? నన్ను గాడిదని చెయ్యాలని చూస్తున్నావన్న మాట. గీతని నా కివ్వకపోయినా ఫర్వా లేదు. వనమాలికి మాత్రం ఇవ్వకూడదు. ఇస్తే....యు ఆర్ నో మోర్. బాగా ఆలోచించుకో...." కిష్టారావు గర్జించి వెళ్ళిపోయాడు.

సీతారాములు భోజనం చేస్తుండగా వనమాలి దగ్గర్నుంచి రమ్మని కబురు వచ్చింది. వీళ్ళిద్దరి మధ్య తను బంతి అయిపోయాడు. ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్ళు ఆడిస్తున్నారు సీతారాములువేగిరం భోజనంచేసి వనమాలిని కలుసుకున్నాడు.

"సాయంత్రం నేను వచ్చాను. నువ్వు లేవు నేను అక్కడ వుండగా కిష్టారావు వచ్చాడు. గీతని అతడి కిస్తు న్నావటకదా! సీతారాములూ .... నన్ను కాదనే ధైర్యం నీ కెలా వచ్చింది? కిష్టారావు నా శత్రువు. గీత నన్ను తిరస్కరించినా ఫర్వాలేదు. వాడ్ని చేసు కుందా....నీ అంతు చూస్తాను. వెళ్ళు. బాగుపడతావో, బాధలుపడతావో ఆలో చించుకో...." వనమాలి హెచ్చరించాడు.

గీత పెళ్ళి యిప్పటిదాకా సీతా రాములుకి అందమైన కల. అది యిప్పుడు శాపమయి కూర్చుంది. ఇంటి కెళ్ళగానే కూతురితో అత్యవసర సమా

వేళం జరిపాడు. ఎవర్ని చేసుకుంటావని అడిగాడు. "మీ యిష్టం నాన్నారూ" అంది గీత. నిర్ణయం తనమీద పడేసరికి సీతారాములుకి కంగారు ఎక్కువైంది. వారం రోజులు గడిచినా తేల్చుకోలేక పోయాడు. వనమాలి, కిష్టారావుల దగ్గర్నుంచి మనుషులు వచ్చి బెదిరిస్తూనే వున్నారు.

ఆదివారం మధ్యాహ్నం విడివిడిగా వనమాలి, కిష్టారావు వచ్చి 'ఏంచేశావని' నిగ్గతీశారు. సీతారాములు పులి, సింహం మధ్య నిలబడిన మేకలా వొణికిపో సాగాడు. మాటలు రాని మూగవా డయ్యాడు.

"అలా వున్నావేమిటి మామయ్యా?" తాండవకృష్ణ సైకిల్ దిగి రుమాలుతో తుడుచుకుంటూ లోపలికి వచ్చాడు.

మేనల్లుడ్ని చూడగానే పరదేశంలో అత్తబంధువు కనిపించి నట్లయింది సీతారాములుకి. గీతని ఎవరికిచ్చినా ముప్పే. వారివల్ల బాధతప్పదు. మేనల్లుడి కిస్తే వాళ్ళ సహకారమూ లభిస్తుంది. హడావిడిగా లేచి మేనల్లుడి భుజంతట్టి "గీతని నువ్వు చేసుకుంటావా బాబూ? వీళ్ళతో నాకు పిచ్చెక్కేలా వుంది". ఆదుర్దాగా అడిగాడు.

"అది అడుగుదామనే వచ్చాను. వెతకబోయిన తీగ కాలికే తగిలిందన్న మాట. గీతా .... కమాన్. మన లైన్ క్లియర్" లోపలికి చూస్తూ పిలిచాడు.

గీత చిరుసిగ్గుపడుతూ దగ్గరకొచ్చింది.

వనమాలి, కిష్టారావు వారికి శుభా కాంక్షలు అందజేశారు.

నాలుగురోజుల్లో గీత, కృష్ణల పెళ్ళయిపోయింది. సీతారాములుకి గుహ నించి బయటికి వచ్చినట్లయింది.

ఆ రాత్రి శోభనం:

కృష్ణ పిలుస్తాడని, మంచం దగ్గరకి తీసుకువెళతాడని గుమ్మంలోనే ఆగి పోయింది గీత. కృష్ణ ఎంతకీ పిలవలేదు. దిండుమీద, మోచేతులమీద పడుకుని కూనిరాగాలు తీస్తున్నాడు.

"మనిషివా? రాయివా?" కోప్పడుతూ దగ్గరకి వచ్చింది.

తాండవకృష్ణ జేబులోనుంచి బాండ్ కాగితం తీసి మొదటిక్లాజు చదివాడు. "నా అనుమతిలేనిదే ముట్టుకోరాదు...." అని చదివి "నీ అనుమతి కోసం ఆగాను" అన్నాడు.

గీత సంపెంగ మొగ్గలువొలకబోస్తు న్నట్లు నవ్వింది. "పిచ్చి బావా? ఆబాండ్ ముప్పయి క్లాజులతో తయారుచేసి వనమాలిని, కాకిని హడలుగొట్టి పెళ్ళి మాట ఎత్తకుండా చేశాను. వాళ్ళిద్దరినీ వుపయోగించి మా నాన్నని కవర్ చేశాను. ఇదంతా నీకోసం కాదూ?"

"నిజం!" ఆశ్చర్యంగా ఆమె ముఖం లోకి తొంగిచూశాడు.

గీత బాండ్ చింపి పడేసి అతడి ఒడిలో వాలిపోయింది.

తాండవకృష్ణ గీతని........

———